సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



భద్రకాళీ ఆలయంలో తనిఖీ

వరంగల్ భద్రకాళీ ఆలయంలో అమ్మవారికి నిత్యం సమర్పించే నైవేద్యం, ప్రసాదాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. - 8లో▸



వినియోగదారులకు శుభవార్త..

విద్యుత్‌ను ఆదా చేసే శక్తి, సమర్థవంతమైన ఉపకరణాల కొనుగోళ్లకు విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ-కామర్స్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31.3^0/25.1^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

28న జాతీయ లోక్ అదాలత్

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని జిల్లా కోర్టుతో పాటు సబ్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు సహకరించాలని కోరారు.

రేపు మహాధర్నా

భూపాలపల్లి రూరల్: హైదరాబాద్‌లోని టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్ వద్ద గురువారం ఆర్టిజన్ కార్మికులు మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆర్టిజన్ కన్వర్షన్ సాధన కమిటీ జిల్లా జేఏసీ చైర్మన్ తిప్పరావు రాజు, కన్వీనర్ మోతుక్కూరి కోటి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ శాఖలో ఆర్టిజన్ కార్మికులతో చాలా సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేపిస్తున్నారన్నారు. మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సెక్యూరిటీ సిబ్బంది నియామకంపై నిర్లక్ష్యం

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో సెక్యూరిటీ సిబ్బంది పోస్టుల నియామకంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య ఆరోపించారు. ఏరియాలోని సెక్యూరిటీ కార్యాలయంలో మంగళవారం సెక్యూరిటీ సిబ్బందితో గేట్ మీటింగ్ ఏర్పాటు చేసి రాజయ్య మాట్లాడారు. సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీని నియమించడంలో ఉన్న శ్రద్ధ సొంత సిబ్బందిని నియమించుకోవడంలో లేదన్నారు. ఆరు నెలల క్రితం జమేదార్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. జూనియర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ల కొరత ఉందన్నారు. ఇంకా ప్రైవేట్ సిబ్బందిని నియమించుకునే కుట్ర పన్నుతున్నట్లు అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ఇంటర్నల్ పరీక్షలు నిర్వహించి సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో కార్మికులకు 33శాతం లాభాల వాటాతో కాంట్రాక్ట్ కార్మికులు రూ.5వేల చొప్పున బోనస్ ఇప్పించేందుకు ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య తెలిపారు. ఏరియాలో కేటీకే 5వ గనిలో మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ.. జనక్‌ప్రసాద్ నిరంతరం కార్మికుల కోసం పోరాడుతున్నట్లు తెలిపారు. కార్మికుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా లాభాల్లో నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు సైతం రూ.5వేల చొప్పున బోనస్ ఇచ్చేందుకు యాజమాన్యం, ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రకటించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేందర్, సదయ్య, వేణుగోపాల్, రాంబాబు, రాజేష్, శ్రీనివాస్, రాజయ్య, రాజు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



గణపురం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి మధుసూదన్ సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు బుద్దారం సబ్ సెంటర్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ప్రజలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యసిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్య సేవలను అందించాలని ఆదేశించారు.

27న అవగాహన

భూపాలపల్లి అర్బన్: వాయు రిక్రూట్‌మెంట్‌పై ఈ నెల 27న అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ అధికారి శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలో తెలంగాణలో నిర్వహించే అగ్నివీర్ వాయు రిక్రూట్‌మెంట్ దృష్ట్యా అగ్నిపథ్ స్కీంపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అవగాహన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష, దేహ దారుఢ్య పరీక్షలపై అవగాహన కల్పించి అన్ని రకాల సందేహాలకు సమాధానాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి పలు సమస్యలు

స్థానికులు ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. కాళేశ్వరం ప్రధానఘాటు గోదావరి వద్ద నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ నుంచి వ్యర్థాలు గోదావరిలో కలుపుతున్నారని స్థానికులు తెలుపగా.. తక్షణం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అస్థికలు గోదావరిలో కలిపేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దేవాలయ ఆధీనంలో ఉన్న రూములు ఇవ్వాలని, ఎందుకు ఇవ్వడం లేదని దేవస్థానం అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మళ్లీ ఇలాంటి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోదావరి ఘాట్‌ను పరిశీలిస్తున్న అధికారులు



ఆధునిక కాళేశ్వరం

ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- భక్తులకు ఉత్తమంగా సేవలందించే దిశగా చర్యలు
- 2027వరకు పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు
- మేడిగడ్డ బరాజ్ వద్ద మ్యూజియం, బృందావన పార్కు నిర్మాణం
- దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

కాళేశ్వరం: కాళేశ్వరం దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారుచేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. భక్తులకు ఉత్తమ సేవలను అందించి, పర్యాటకుల సంఖ్యను పెంచడమే మాస్టర్ ప్లాన్ ప్రధాన లక్ష్యమన్నారు. వచ్చే ఏడాది సరస్వతీ పుష్కరాల వరకు పనులు గుర్తించి, 2027 గోదావరి పుష్కరాల వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శాశ్వతంగా పనులు పూర్తిచేస్తామని అన్నారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఆమె కలెక్టర్ రాహుల్ శర్మ, దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్‌లతో కలిసి కాళేశ్వరం ఈఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రూ.100కోట్లతో దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్, రూ.115కోట్లతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేశారు. ఇంకా ప్రతిపాదనలు పెరిగే అవకాశం ఉంది. కాళేశ్వరంలో జరిగే సరస్వతి పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు తదితర అంశాలపై దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

దేవస్థానం విస్తరణ..

ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ కాళేశ్వరం దేవాలయం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా దేవాలయ విస్తరణ, ఆలయ ప్రాంగణాన్ని విస్తరించడం, పునర్నిర్మాణం, ఆధునీకరణ, యాత్రికులకు సదుపాయాల కల్పన, యాత్రికుల కోసం ఆవాస సదుపాయాలు, భోజన శాలలు, పార్కింగ్ స్థలాలు, సురక్షితమైన నీటి సదుపాయాలను ఏర్పాటు చేయడం లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అభివృద్ధి చర్యలు ప్రవేశ ద్వారం, దేవాలయ ప్రధాన ద్వారాన్ని శిల్పకళతో అందంగా నిర్మించడం, యాత్రికుల సౌకర్యార్థం విస్తారమైన మండపాల నిర్మాణం, గోదావరి ఘాట్ అభివృద్ధి, గోదావరి నది తీరాన్ని శుభ్రతతో, అందంగా అభివృద్ధి చేయడం, స్నాన ఘాట్లను ఏర్పాటు చేయడం వంటివి చేపట్టనున్నట్లు తెలిపారు. దేవాలయం చుట్టూ పర్యాటక మార్గాలను అభివృద్ధి చేయడం, స్థానిక సాంస్కృతిక ప్రదర్శనలు, మేడిగడ్డ బరాజ్ వద్ద మ్యూజియంలు, బృందావన్ గార్డెన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భద్రతను పెంచేందుకు ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, దేవాదాయ, పర్యాటకశాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటుచేయాలని ఆదేశించారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యేకంగా మంజూరైన నిధులతో చేపట్టిన పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు.



మాట్లాడుతున్న శైలజా రామయ్యర్, పక్కన కమిషనర్ హన్మంతరావు, కలెక్టర్ రాహుల్ శర్మ

సమస్యల పరిష్కారానికి రాజీపడొద్దు..

సమాచారపౌర సంబంధాలు, దేవాదాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ భక్తులకు సౌకర్యాల కల్పనలో రాజీపడొద్దని తెలిపారు. కాళేశ్వరం వచ్చే భక్తులు మహిళలు, పురుషులు బట్టలు మార్చుకునేందుకు స్నానపు గదులు ఏర్పాటుచేయాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న 100 గదులను త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. కాళేశ్వరంలో 2025లో జరుగు సరస్వతి పుష్కరాల నిర్వహణకు ఘాట్‌సిద్ధం చేయాలన్నారు. గోదావరి హారతి కార్యక్రమాలను పౌర్ణమి రోజుల్లో కాకుండా వారానికి ఒకసారి చేపట్టాలని అన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ రూ.19.39 కోట్ల ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టిన పనుల్లో రూ.12.07 కోట్ల విలువ గల పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనుల్లో భూసమస్యతో నాలుగు పనులు ఆగిపోయాయని చెప్పారు. పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం గోదావరి ఘాట్‌ను అధికారులు స్థానికులతో కలిసి పరిశీలించారు. నెలనెలా సమావేశాలు జరుగుతాయని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీసీ శ్రీకాంత్‌రావు, ఈఓ మారుతి, డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్సైలే కీలకం

ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: సమాజంలో పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని ఎస్సైలు అంకితభావంతో పనిచేసినప్పుడే విధులకు సార్థకత లభిస్తుందని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. ఎస్సైలకు శిక్షణలో భాగంగా 11 పోలీస్ స్టేషన్లలో పనిచేసేందుకు ఎస్పీ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉన్న ఎస్సైలు విధి నిర్వహణలో ప్రత్యేకత చాటుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. ఎస్సైలుగా బాధ్యతలు నిర్వహించడం కత్తిమీద సాములాంటిదన్నారు. శిక్షణలో చివరి ఘట్టంలో మండలస్థాయి ప్రజల మదిలో తమదైన ముద్ర వేయాలని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా భద్రత, నేరాలు, దొంగతనాలు అరికట్టడం, సైబర్ నేరాల నియంత్రణ పోలీసుల లక్ష్యమన్నారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలు, బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఉద్యోగంలో ఎన్నో కఠిన పరిస్థితులు, సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలని అన్నారు. నిజాయతీగా, అంకితభావంతో సేవలు అందించాలని ఎస్పీ పేర్కొన్నారు.



ఎస్పీ కిరణ్ ఖరేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్సైలు

వాస్తవ లాభాలు ప్రకటించాలి

భూపాలపల్లి అర్బన్: గత ఆర్థిక సంవత్సరంలో కార్మికులు సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితెల సమ్మయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.4,700కోట్ల లాభాలు వస్తే యాజమాన్యం నికర లాభాలు ప్రకటించకుండా రూ.2,289 కోట్లు మాత్రమే ప్రకటించడం కార్మికులను మోసం చేయడమేన్నారు. వాస్తవంగా కార్మికులకు రావాల్సిన లాభాలు అందించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల కోసం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదానందం, మధు, కుమారస్వామి, రాంచందర్, మల్లారెడ్డి, నరేష్, రాజేందర్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

జీహెచ్‌ఎంలకు ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓల స్థానంలో బాధ్యతలు అప్పగించారు. భూపాలపల్లి ఇన్‌చార్జ్ ఎంఈఓగా దేవా (జెడ్పీహెచ్‌ఎస్, కొంపల్లి), చిట్యాల రఘుపతి (జెడ్పీహెచ్‌ఎస్ చిట్యాల), మొగుళ్లపల్లి కుమారస్వామి (జెడ్పీహెచ్‌ఎస్ మెట్లపల్లి), కాటారం శ్రీదేవి (జెడ్పీహెచ్‌ఎస్, దేవరాంపల్లి), టేకుమట్ల సుధాకర్ (జెడ్పీహెచ్‌ఎస్ టేకుమట్ల), రేగొండ ప్రభాకర్ (జెడ్పీహెచ్‌ఎస్ రంగయ్యపల్లి), మల్హర్ లక్ష్మణ్‌బాబు (జెడ్పీహెచ్‌ఎస్ రుద్రారం), మహాముత్తారం సంజీవరెడ్డి (జెడ్పీహెచ్‌ఎస్ ములుగుపల్లి), మహదేవపూర్ శంకరయ్య (జెడ్పీహెచ్‌ఎస్ బొమ్మపూర్), పలిమెల వెంకటరాజం (జెడ్పీహెచ్‌ఎస్ అంబట్‌పల్లి), గణపురం ఉప్పలయ్య (జెడ్పీహెచ్‌ఎస్ ధర్మరావుపేట), కొత్తపల్లిగోరి చంద్రశేఖర్ (జెడ్పీహెచ్‌ఎస్ జగ్గయ్యపేట) ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

పూస్కుపల్లిలో సీసీ కెమెరాలు ప్రారంభం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలోని పూస్కుపల్లి గ్రామంలో సీసీ కెమెరాలను కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ఆయన వెంట సీఐ రామచంద్రరావు, ఎస్సై చక్రపాణి, గ్రామస్తుడు కిషన్ ఉన్నారు.



ఉన్నతాధికారుల పూజలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఆలయంలో రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, సమాచార పౌర సంబంధాల శాఖ, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు వేర్వేరుగా శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామిని మంగళవారం దర్శించుకున్నారు. మంగళవారం ఆలయ రాజగోపురం వద్దకు రాగా, ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో మంగళవాయిద్యాల నడుమ స్వాగతం పలికారు. గణపతి పూజ, అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వచన వేదిక వద్ద అర్చకులు వారిని స్వామివారి కండువాలతో సన్మానించి, చిత్రపటం అందజేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఈఓ మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ, ఫణీంద్ర శర్మ, రామకృష్ణశర్మ, వైకుంఠ పాండా, శరత్‌చంద్ర శర్మ పాల్గొన్నారు.

పురాతన విగ్రహాలను ఆర్డర్‌లో పెట్టాలి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని పురాతన విగ్రహాలను నిర్లక్ష్యంగా పడేయగా మంగళవారం దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజారామయ్యర్, శాఖ కమిషనర్ హనుమంతరావు పరిశీలించారు. ఛిన్నంగా మారిన విగ్రహాలను ఒక ఆర్డర్ ప్రకారం ఒకే వేదికగా భావితరాలకు గొప్పతనం తెలిసేలా పెట్టాలని ఆదేశించారు. విగ్రహాల పేర్లు తదితర అంశాలు అర్థమయ్యేలా ఏర్పాటుచేయాలని సూచించారు. అర్చకుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. వారివెంట కలెక్టర్ రాహుల్‌శర్మ, సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, స్థపతి వల్లినాయగం, స్థానికులు కామిడి లక్ష్మీశ్రీనివాసరెడ్డి ఉన్నారు.

ధన్వాడలో ప్రత్యేక పూజలు

కాటారం: కాటారం మండలం ధన్వాడలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సమాచార పౌర సంబంధాలు, దేవాదాయశాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి దత్తాత్రేయ ఆలయాన్ని ఆమె సందర్శించారు. ఆలయ పురోహితులు అర్చన చేశారు. అనంతరం ప్రత్యేక కమిషనర్, కలెక్టర్‌ను శైలజా రామయ్యార్ శాలువాలతో సత్కరించారు. వీరి వెంట కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, పలు శాఖల అధికారులు ఉన్నారు.



గర్భగుడిలోని లింగాలకు అభిషేక పూజలు చేస్తున్న శైలజా రామయ్యర్

‘చిన్నకాళేశ్వరం’ పనులు పూర్తిచేయాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కాటారం మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, విద్యుత్‌శాఖ అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల పురోగతి, చెరువుల పునరుద్ధరణ పనులు, పైప్‌లైన్ కనెక్టివిటీ, భూ సేకరణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. పనుల్లో జాప్యంపై ఆరాతీశారు. నిర్మాణ పనులను యుద్ధ ప్రతిపాదికన ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మహదేవపూర్ మందిరం చెరువు భూ సేకరణకు సంబంధించి అటవీశాఖ అనుమతి ఇబ్బందిగా మారడంతో వెంటనే భూసమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్ పరిధిలోని మందిరం, ఎర్ర చెరువు, వీరాపూర్, కొత్త చెరువులకు నీటి సరఫరా జరుగుతుందన్నారు. మిగితా చెరువు పునరుద్ధరణ పనులు పూర్తిచేసి నీరు నింపాలని.. వీలైనంత త్వరగా ట్రయల్‌రన్ చేయాలని కలెక్టర్ సూచించారు. స్టేజ్ -1 పంప్‌హౌస్‌లో విద్యుత్ సరఫరా పనులను పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. గారెపల్లి రిజర్వాయర్ భూ సేకరణ సమస్యపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని.. పనుల్లో వేగం పెంచి పూర్తిచేయాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో మినీస్టేడియానికి కేటాయించిన తిమ్మనకుంట శిఖం భూమిని కలెక్టర్, సబ్ కలెక్టర్ పరిశీలించారు. మినీ స్టేడియానికి కేటాయించిన భూమి ఆక్రమణకు గురికావడంతో పాటు గత కలెక్టర్ స్టేడియం ఏర్పాటుకు మంజూరుచేసిన రూ.30 లక్షల నిధులు నిరుపయోగంగా మారిపోతున్నాయని.. మండలకేంద్రానికి చెందిన జక్కు శ్రావణ్ కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ మినీ స్టేడియం స్థలం పరిశీలించి సంబంధించిన పత్రాలను చూశారు. వెంటనే సర్వే చేపట్టాలని పూర్తి భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్టేడియం నిర్మాణ పనుల జాప్యంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మినీ స్టేడియం భూమి ఆక్రమణకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవడంతో పాటు స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ ఈఈ యాదగిరి, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, డీవైఎస్‌ఓ జైపాల్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువులను పరిరక్షించాలని వినతి

కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్, పలిమెల మండలాల్లోని చెరువులను పరిరక్షించడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి మంగళవారం కాటారంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌ను చల్ల నారాయణరెడ్డి, బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి, నాయకులు ఆత్మకూరి స్వామియాదవ్, డోలి అర్జయ్య, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ రాహుల్‌శర్మకు తమ గోడు వెల్లబోసుకుంటున్న భూ నిర్వాసితులు



కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం సమర్పిస్తున్న నారాయణరెడ్డి, నాయకులు

పరిహారం ఇప్పించాలని వేడుకోలు..

చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలోని గారెపల్లి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా కోల్పోతున్న భూములకు నష్టపరిహారం అందించాలని భూ నిర్వాసితులు కలెక్టర్ రాహుల్ శర్మను వేడుకున్నారు. సమీక్షా సమావేశం అనంతరం కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆధారంగా ఉన్న భూమి కోల్పోయి 12 ఏళ్లుగా నష్టపరిహారం అందక రోడ్డున పడ్డామని కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. 33 ఎకరాలకు సంబంధించి 68 మందికి పరిహారం అందాల్సి ఉందని కలెక్టర్‌కు వివరించారు. పరిహారం ఇవ్వకుండా అధికారులు పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్వాసితులు ఆందోళన చెందవద్దని.. పూర్తి వివరాలు సేకరించి సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. నిర్వాసితులు మాచెర్ల రాజేందర్, చీమల సత్యం, చీమల వెంకటస్వామి, బలరాం, సంతోష్, మహిళలు ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, తాగునీటి పైపులైన్లు, డ్రెయినేజీ తదితర పనుల పురోగతిపై ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

డిగ్రీలో ఫెయిలయ్యానని.. విద్యార్థి బలవన్మరణం


దిలీప్ (ఫైల్)

రఘునాథపల్లి: డిగ్రీ పరీక్షలో ఫెయిలయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామానికి చెందిన రాపాక దిలీప్ (22) హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. అందులో ఓ సబ్జెక్ట్‌లో ఫెయిల్‌కాగా సప్లిమెంటరీ రాశాడు.పరీక్ష ఫలితాల్లో మళ్లీ ఫెయిల్ కావడంతో జీవితంపై విరక్తి చెందిన దిలీప్ ఈ నెల 22న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వ్యవసాయ పనులకు వెళ్లిన తల్లి విజయకు ఫోన్‌చేసి తాను పురుగుల మందు తాగినట్లు తెలపగా, భర్త పరుశరాములుతో కలిసి రోదిస్తూ ఇంటికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారకస్థితికి చేరుకున్న దిలీప్‌ను జనగామ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

పత్తికి ఆపతి..


పత్తి పంటను ఆశించిన పేను బంక, పచ్చ దోమ, తామర పురుగు

తెల్లబంగారానికి ఆశిస్తున్న రసంపీల్చే పురుగులు

- రైతులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- మల్యాల కేవీకే సమన్వయకర్త ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త కె.క్రాంతికుమార్
- అన్నదాతలకు పలు సలహాలు, సూచనలు

మహబూబాబాద్ రూరల్ : పత్తి.. తెల్లబంగారం. రైతుల ఇంట సిరులు కురిపించే పంట. అన్నదాతలకు అధిక లాభాలు అర్జించి పెట్టే ప్రధాన సాగు. అయితే ప్రస్తుతం పత్తి పంటను రసంపీల్చే పురుగులు ఆశించి తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయి. ఈ క్రమంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను ఆ పురుగుల బారినుంచి రక్షించుకోవాలి. అప్పుడే పంట చేతికొస్తుంది. లేని పక్షంలో నష్టాల బారిన పడే అవకాశం ఉందని మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త కె.క్రాంతికుమార్ అన్నారు. గత నెల, ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిలో చీడపీడల ఉధృతి అధికం కావడం, ప్రధానంగా రసంపీల్చే పురుగుల ఉధృతి పెరుగుతున్నట్లు గమనించామని తెలిపారు. ఈ నేపథ్యంలో పంట రక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..


డాక్టర్ ఎస్.మాలతి


కె.క్రాంతికుమార్

పేను బంక ..

పత్తి పంటకు పేను బంక ఆశించినప్పుడు లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి తల్లి, పిల్ల పురుగులు రసం పీల్చడం, ఆకులు దోనెలుగా మారడం, తేనె వంటి జిగురు పదార్థం విసర్జించడం వల్ల మొక్కల ఆకులపై నల్లని బూజు ఏర్పడుతుంది. పేను బంక నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మిల్లీ లీటర్లు, థయోమిథాక్సాం 0.2 గ్రాములను ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

పచ్చ దోమ ..

పత్తి పంటకు పచ్చ దోమ ఆశించి ఆకుల అడుగు భాగంలో పిల్ల, తల్లి పురుగులు చేరుతాయి. ఆకుల నుంచి రసం పీల్చుతాయి. తద్వారా ఆకుల ఈనెలు దోనెలుగా ముడుచుకుని పసుపు రంగులోకి మారుతాయి. పచ్చ దోమ నివారణకుగాను ఇమిడాక్లోప్రిడ్ లేదా ప్లోనికామైడ్ లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు ఎసిఫేట్ 75 ఎస్.పీ 1.05 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామర పురుగు

పత్తి పంటకు తామర పురుగు ఆశించినప్పుడు తల్లి, పిల్ల పురుగులు సన్నగా పసుపు రంగులోకి మారుతాయి. ఆకు అడుగు భాగాన రసం పీల్చడం వల్ల ఆకులు పెలుసుగా మారుతాయి. ఆకుల అడుగున ఈనెల వెంబడి వెండి వలే మెరిసే చారలు కనిపిస్తాయి. తల మాడు తెగులు పత్తిలో తామర పురుగుల వల్ల వ్యాప్తి చెందుతుంది. తామర పురుగు నివారణకుగాను మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ 75 ఎస్.పీ లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి లేదా డైఫెంథయూరాన్ 1.25 గ్రాములు లేదా స్పైనోటోరం 0.9 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

తెల్ల దోమ :

పత్తి పంటను తెల్ల దోమ పింద, కాయ దశలో ఆశిస్తుంది. ఆకుల మీద పచ్చదనం కోల్పోయి మచ్చలు ఏర్పడి, ఆకులు పెరగకుండా ముందే రాలిపోతాయి. పురుగు సోకిన మొక్కలు గిడసబారి పూమొగ్గలు, కాయలు రాలిపోతాయి. తెల్ల దోమ నివారణకు డైఫెన్ థయూరాన్ ఒకటి పాయింట్ 2.05 గ్రాములను లీటర్ నీటికి లేదా స్పైరోమెసిసిన్ మిల్లీ లీటర్ లేదా థయోమిథాక్సాం 0.2 గ్రాములు లేదా సల్ఫాక్సా ఫ్లోర్ 0.75 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పిండి నల్లి :

పత్తి పంటను పిండి నల్లి ఆశించినప్పుడు చిన్న పురుగులు లేత పసుపు రంగులో ఉంటాయి. తల్లి పురుగులు రెక్కలు లేకుండా మైనపు పూత కలిగిన వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి. ఈ పురుగులు ఆకు తొడిమల నుంచి పూత, కాయల నుంచి రసం పీల్చడం వల్ల ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడుతాయి. పిండి నల్లి నివారణకు ప్రొపెనోఫాస్ 50 ఈ.సీ లేదా మిథైల్ పారాథియాన్ 50 ఈ.సీ ఎసిఫేట్ రెండు గ్రాములతోపాటు ట్రిటాన్ లేదా సాండోవిట్ లాంటి జిగురు మందులను ఒక మిల్లీ లీటర్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నూతన పద్ధతులతో వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్

- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ


జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్ : నూతన పద్ధతులు అవలంబిస్తూ ప్రయోగాత్మకంగా వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ చేపట్టాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెమినార్‌హాల్ కాంప్లెక్స్‌లో మంగవారం నిట్ వరంగల్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, ఐఐటీ ఖరగ్‌పూర్, కెనడా మెక్‌గిల్ యూనివర్సిటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'అడ్వాన్స్‌సెస్ ఇన్ బయోలాజికల్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ అండ్ ఇంటిగ్రేటెడ్ ఆఫ్ అకడమిక్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. బయోలాజికల్ వ్యర్థాల సేకరణలో మున్సిపాలిటీ పాత్ర కీలకమని, మురుగు నీటిని ఉపయోగకరంగా మార్చేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కెనడా మెక్‌గిల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ రాఘవన్, ప్రొఫెసర్లు శిరీశ్ హరి, పి.వి.రావు, సూరజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో అధికారుల తనిఖీ

- అమ్మవారికి సమర్పించిన నైవేద్యం, ప్రసాదం పరిశీలన
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచన


పులిహోర ప్రసాదాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హన్మకొండ కల్చరల్ : తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని ఉపయోగించారనే అంశంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నెయ్యిలో జంతు సంబంధిత కొవ్వు కలిసినట్లు తలెత్తిన ఆరోపణల సెగ నగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవాలయానికి తాకింది. మంగళవారం శ్రీభద్రకాళి ఆలయాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ మేరకు వరంగల్ జిల్లా ఆహార పరిరక్షణ అధికారి చేపూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ. శేషభారతితో కలిసి అధికారులు అమ్మవారికి నిత్యం సమర్పించే నైవేద్యం, ప్రసాదాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రసాదం, నైవేద్యాలు తయారు చేసే వంట గదుల శుభ్రత, లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి, ఇతర పదార్థాల గురించి ఈఓను అడిగి తెలుసుకున్నారు. కల్తీపై ఆరాతీశారు. వాటి నాణ్యత పరిశీలించిన అనంతరం శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు. భక్తుల విశ్వాసం చూరగొనేలా నాణ్యతకు పెద్ద పీట వేయాలని పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ. శేషభారతి మాట్లాడుతూ అమ్మవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగదని, నిత్యం శుభ్రం , నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామన్నారు. గత ఫిబ్రవరి (2024)లో భారత ప్రభుత్వ ఆహారపరిరక్షణ ప్రమాణాల అధికారిక సంస్థ ప్రతినిధులు 'ఈట్ రైట్ ప్లేస్ ఆఫ్ వర్‌షిప్' సర్టిఫికెట్‌ను దేవాలయానికి జారీ చేశారని తెలిపారు. ఏపీ ఫెడరేషన్ విజయ కంపెనీ నెయ్యి వాడుతున్నామని, భక్తులకు నాణ్యమైన ప్రసాదాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


ముడిసరుకులను పరిశీలిస్తున్న అధికారులు

వినియోగదారులకు శుభవార్త..

- తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్ పొదుపు చేసే ఉపకరణాలు
- ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ ద్వారా విక్రయాలు
- ఈ-కామర్స్ ద్వారా కొనుగోళ్లకు అవకాశం

హన్మకొండ: వినియోగదారులకు శుభవార్త. ఇక నుంచి కరెంట్ బిల్లుల మోత నుంచి ఉపశమనం పొందొచ్చు. విద్యుత్‌ను ఆదా చేసే శక్తి, సమర్థవంతమైన ఉపకరణాలు కొనుగోళ్లకు విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ-కామర్స్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది. ఈ ఉపకరణాలు తక్కువ ధరకు లభించడంతో పాటు విద్యుత్‌ను పొదుపు చేస్తాయి. వినియోగదారులను విద్యుత్ పొదుపు వైపునకు ప్రోత్సహించడానికి 5 స్టార్ రేటింగ్ కలిగిన ఉపకరణాలను 'ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్' అనే సంస్థ.. ఈ-కామర్స్ మార్కెటింగ్ ద్వారా విక్రయిస్తోంది. ఈ ఉపకరణాల కోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఉపకరణాలు వినియోగించడం ద్వారా మూడు సంవత్సరాల్లో వీటి కొనుగోళ్లకు చేసిన పెట్టుబడిని విద్యుత్ పొదుపు రూపంలో పొందొచ్చని ఇంజనీర్లు చెప్పారు. ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లు, ఇండక్షన్ స్టవ్, 5 స్టార్ బీఎల్‌డీసీ ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియెంట్ ఏయిర్ కండీషన్ (ఏసీ)లు, ఎల్ఈడీ ఇన్వర్టర్ బల్బులు ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ పోర్టర్‌లో అందుబాటులో ఉన్నాయి. వినియోగదారులు టీజీ ఎన్పీడీసీఎల్ డాట్ కామ్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఈఈఎస్ఎల్ హోమ్ పేజీలోకి వెళ్లి అందుబాటులో ఉన్న ఉపకరణాలు కొనుగోలు చేయొచ్చు. ఆర్డర్ చేసిన వస్తువులు నేరుగా ఇంటికి డెలివరీ అవుతాయి. వినియోగదారులు ఈఈఎస్ఎల్ హోమ్ పేజీలోకి వెళ్లి కావాల్సిన ఉపకరణాన్ని ఎంచుకున్న తర్వాత ఈ-మెయిల్‌తో లాగిన్ కావాలని కోరుతుంది. లాగిన్ కాగానే చిరునామా వివరాలు నమోదు చేయాలి. తర్వాత చెల్లింపులు చేసే విధానం చూపుతుంది. వినియోగదారుడు తనకు అందుబాటులో ఉన్న విధానంలో ఉపకరణానికి సంబంధించిన సొమ్ము చెల్లించగానే బుకింగ్ కార్యక్రమం పూర్తవుతుంది. ఆ తర్వాత నిర్ణీత సమయంలో వినియోగదారుడికి డెలివరీ అవుతుంది. అదే విధంగా ఈఈఎస్ఎల్ పేజీలో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా ఆర్డర్ చేసుకునే వెసులుబాటు ఉంది.



ఈఈఎస్ఎల్ పోర్టల్‌లో విద్యుత్ ఉపకరణాలు (లోగో)

నాణ్యమైన విద్యుత్ ఉపకరణాల కొనుగోళ్లకు ఉత్తమ వేదిక



నాణ్యమైన విద్యుత్ ఉపకరణాల కొనుగోళ్లకు ఈ-కామర్స్ మార్కెటింగ్ ఉత్తమ వేదిక. ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ పోర్టల్‌లో విద్యుత్ పొదుపు చేసే నాణ్యమైన, సమర్థవంతమైన విద్యుత్ ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. విద్యుత్ పొదుపు చేయడమంటే డబ్బు పొదుపు చేసినట్లే. ఈఈఎస్ఎల్ పోర్టల్‌లో విద్యుత్ ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన వినియోగదారులు సరసమైన ధరలకు కొనుగోలు చేసుకోవచ్చు. మన్నిక కలిగి ఉండడంతో పాటు విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది. మరిన్ని ప్రయోజనాలు పొందొచ్చు.

- కె.వెంకటనారాయణ, ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ

బెదిరించి.. సీక్రెట్‌గా వీడియో తీశారు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

జనగామ: జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై చేసిన హత్యాయత్నం ఫిర్యాదుకు సంబంధించి ముగ్గురు నాయకులు జనగామ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో తనను బెదిరించి వీడియోలో మాట్లాడించారని అదే పార్టీకి చెందిన నాయకుడు రాహుల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం సీఐ దామోదర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పదిహేను రోజుల క్రితం టీపీసీసీ కార్యదర్శి కంచె రాములు, మునిసిపల్, మార్కెట్ మాజీ చైర్మన్లు వేమెళ్ల సత్యనారాయణ, ఎర్రమల్ల సుధాకర్‌లు తనకు ఫోన్ చేసి జనగామకు పిలిపించారన్నారు. చాయ్ తాగేందుకు ఆర్అండ్‌బీ అతిథి గృహానికి తీసుకెళ్లి, డోర్ లాక్ చేసి బెదిరింపులకు దిగారన్నారు. ప్రతాప్‌రెడ్డిపై తాము చెప్పినట్టుగా మాట్లాడాలని ఒత్తిడి చేసినట్లు వివరించారు. లేకుంటే ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కంచె రాములును చంపేందుకు ప్రతాప్‌రెడ్డి తనకు రూ.25లక్షల సుపారీ ఇచ్చినట్లు చెప్పాలని బెదిరింపులకు దిగడంతో ఎలా బయటపడాలనే ఉద్దేశంతో తాను అలా మాట్లాడితే, దానిని సీక్రెట్‌గా వీడియో తీసి, బ్లాక్ మెయిల్ చేస్తున్నారన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనకు రూ.25లక్షలు సుపారీ ఇచ్చినట్లు పిటిషన్‌లో రాసిన సంగతి తనకు తెలియదని, మీడియాలో వచ్చిన తర్వాత ఖంగుతిన్నట్లు చెప్పారు. ముగ్గురు వ్యక్తులపై తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించి, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో వీడియోల పంచాయతీ..

జనగామ కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం రచ్చకెక్కుతోంది. టీపీసీసీ కార్యదర్శి హత్యకు ప్లాన్ చేస్తూ.. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రూ.25 లక్షల సుపారీ ఆఫర్ చేశారని కంచె రాములుతో కలిసి అదే పార్టీకి చెందిన రాహుల శ్రీనివాస్‌రెడ్డి రెండు రోజుల క్రితం డీసీపీ రాజమహేంద్రనాయక్‌ను కలిసిన విషయం తెలిసిందే. 24 గంటలు గడవక ముందే సదరు నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి యూటర్న్ తీసుకుంటూ సోషల్ మీడియా వేదికగా మంగళవారం ఓ వీడియో రిలీజ్ చేశారు. 'ప్రతాపన్న (ప్రతాప్‌రెడ్డి) తనకు సుపారీ కోసం రూ.25లక్షలు ఆఫర్ చేశారనే వార్తల్లో నిజం లేదు.. ఆయనను రాజకీయంగా అణగదొక్కేందుకు యత్నం చేస్తూ బురద జల్లేందుకు కుట్రలు పన్నుతున్నారని' ప్రస్తావించారు. ఇదిలా ఉండగా డీసీపీకి ఫిర్యాదుకు ముందు మరోవర్గం శ్రీనివాస్‌రెడ్డి మాటలకు సంబంధించి వీడియోలను సోషల్ మీడియలో రిలీజ్ చేసింది. దీంతో రెండు వర్గాల మధ్య వీడియో రిలీజ్‌ల పంచాయతీ రచ్చకు దారి తీస్తోంది.

తొర్రూరు మాజీ సర్పంచ్‌కు మూడేళ్ల జైలు



తొర్రూరు: గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓ మహిళతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన తొర్రూరు మాజీ సర్పంచ్ ధరావత్ రాజేశ్‌నాయక్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి మట్ట సరిత మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. 2013లో తొర్రూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న రాజేశ్‌నాయక్ పంచాయతీ కార్యాలయంలో ఓ మహిళతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అప్పటి ఎస్సై రాయల వెంకటేశ్వర్లు పట్టుకుని కేసు నమోదు చేశారు. సీఐ రాజు విచారణ చేపట్టి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి మట్ట సరిత .. మాజీ సర్పంచ్ రాజేశ్‌కు మూడేళ్ల జైలు, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

పిడుగుపాటుకు వృద్ధుడి మృతి

కొత్తగూడ: పిడుగు పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని బత్తులపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన దుగ్గం లక్ష్మయ్య(65) మొక్కజొన్న చేనుకు కోతుల కాపలాకు వెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం వస్తుండడంతో ఇంటికి వెళుతున్న క్రమంలో పిడుగు పడి అక్కడికి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై కుశకుమార్ తెలిపారు.

రంగయ్యపల్లిలో ఇంటిపై పిడుగు..

- సుమారు రూ. 4లక్షల ఆస్తినష్టం


పిడుగుపాటుకు దగ్ధమైన సామగ్రి

ఎల్కతుర్తి: గాలిదుమారంతో కురిసిన భారీ వర్షానికి ఓ ఇంటిపై పిడుగుపడింది. ఈ ప్రమాదంలో ఇంట్లో సామగ్రితో పాటు నిత్యావసర వస్తువులు, దుస్తులు, నగదు మంటలో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రబోజు రాధిక ఇంటికి తాళం వేసి తన తల్లిగారి ఊరికి వెళ్లింది. సోమవారం రాత్రి భారీ వర్షంతో పాటు పిడుగు ఇంటిపై పడింది. ఈ ఘటనలో గోడలు పగుళ్లు చూపడంతో పాటు ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. సామగ్రితో పాటు కొంత నగదు, బంగారం కాలిందని బాధితురాలు మంగళవారం కన్నీరుమున్నీరైంది. తమను ప్రభుత్వం ఆదుకుని ఆర్థిక సాయం అందజేయాలని వేడుకుంది. కాగా, పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

గంజాయి రవాణా ముఠా అరెస్ట్

- 187 కిలోల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు


గూడూరు: పట్టుకున్న గంజాయితో పాటు కారును చూపుతున్న పోలీసులు

గూడూరు: భారీ ఎత్తున ఎండు గంజాయి రవాణా చేస్తున్న ముఠాను గూడూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సర్కిల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం సాయంత్రం మచ్చర్ల బస్ స్టేజీ వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో పట్టుబడిన గంజాయి వివరాలను డీఎస్పీ తిరుపతిరావు మంగళవారం వెల్లడించారు. రెండు కార్లు, 187 కిలోల ఎండు గంజాయితో పాటు, ముగ్గురు వ్యక్తుల అరెస్ట్ చూపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో అక్రమ మార్గాల వైపు దారిమళ్లుతోందన్నారు. ఈ క్రమంలో ఒడిశా నుంచి భద్రాచలం, మహబూబాబాద్, గూడూరు మీదుగా ముగ్గురు వ్యక్తులు రెండు కార్లలో హైదరాబాద్‌కు ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. ఆ గంజాయి విలువ సుమారు రూ. 46 లక్షల 76 వేలు ఉంటుందన్నారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా పులిమేటలకు చెందిన మండల నరేశ్, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కుమ్మరాస్‌కు చెందిన రాహుల్ మజుందార్, రాయ్‌పూర్ జిల్లా అచోచలికి చెందిన హరీశ్‌యాదవ్. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా పులిమేటలకు చెందిన బాపన్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి రెండు కార్లలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. బాపన్ పరారీలో ఉన్నాడని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో గూడూరు సీఐ కె. బాబూరావు, ఎస్సై గిరిధర్‌రెడ్డి, కొత్తగూడ ఎస్సై కుశకుమార్, సిబ్బంది బిచ్చానాయక్, కుమారస్వామి, ప్రణీత్, అప్పు, సైదులు, నార్కోటిక్ డీఎస్పీ డి. సురేశ్, సీఐ బి. రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు గంజాయి నిందితుల రిమాండ్

వర్ధన్నపేట: గంజాయి రవాణా చేస్తూ సోమవారం వర్ధన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టుకున్న నలుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వర్ధన్నపేట సీఐ కె. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బిహార్‌కు చెందిన వివేక్ కుమార్ మిశ్రా, ఢిల్లీకి చెందిన ధర్మేందర్ మలావర్, బాబీదేవి, ద్రౌపదిదేవి, రితీక కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఇందులో భాగంగా ఏపీలోని విశాఖపట్టణానికి చెందిన రవి నుంచి రూ. 6.85 లక్షల విలువైన 27.41 కేజీల ఎండు గంజాయి తీసుకుని ఢిల్లీకి చెందిన అరవింద్‌కు అప్పగించడానికి ఈ నెల 21వ తేదీన విశాఖ నుంచి హుజూర్ సాహెబ్ నాందేడ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి బయలుదేరారు. ఈ నెల 22వ తేదీన ఉదయం కాజీపేట రైల్వే స్టేషన్‌లో సాయంత్రం పోలీసులు బోగీలు తనిఖీ చేస్తున్నారు. గమనించిన వీరు ఇదే రైల్వే స్టేషన్‌లో రైలు దిగారు. అనంతరం రితీక కాజీపేట నుంచి తప్పించుకుంది. మిగతా నలుగురు ఓ లారీలో బయలుదేరి వర్ధన్నపేట ప్రాంతానికి చేరుకున్నారు. రాత్రి నిర్మానుష్య ప్రదేశంలో గడిపి 23 తేదీన సికింద్రాబాద్ వెళ్లడానికి బ్యాగులు తీసుకుని వర్ధన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించింది. దీంతో నలుగురిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న రవి, రితిక, అరవింద్ కోసం గాలింపు చేపడుతన్నామని సీఐ కె. శ్రీనివాసరావు తెలిపారు.